సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం ၊ 21 ၊ ఏప్రిల్ ၊ 2025



కళావిహీనం.. ఆటపాక కేంద్రం

పక్షి ప్రేమికుల స్వర్గధామంగా ఉన్న ఆటపాక పక్షుల విహార కేంద్రం కళావిహీనంగా మారింది. నీటి కొరతతో పక్షులు అల్లాడుతున్నాయి. 8లో



కన్నీటి కెరటాలు

పశ్చిమ తీర ప్రాంతంలోకి సముద్రం చొచ్చుకువస్తోంది. గ్రామాలను కబళిస్తోంది. రక్షణ గోడ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 8లో



భక్తజన సందోహం

ద్వారకాతిరుమల క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. వేకువజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. 8లో

న్యూస్‌రీల్

నరసాపురం జిల్లా జడ్జిగా వాసంతి



నరసాపురం : నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జిగా ఎ.వాసంతి ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ జిల్లా జడ్జిగా పనిచేసిన విజయదుర్గ విశాఖలోని ఏసీబీ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న తణుకు 4వ జిల్లా జడ్జి డి.సత్యవతి నుంచి వాసంతి బాధ్యతలు చేపట్టినట్టు కోర్టు పరిపాలనా అధికారి డి.నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు.

మాలలకు కూటమి ద్రోహం



కొడమంచిలిలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌పై నిరసన తెలుపుతున్న మాలలు

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని మాల సంఘాల జేఏసీ నాయకుడు ఉన్నమట్ల మునిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆచంట మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొడమంచిలి గ్రామంలోఅంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాలల ఆక్రోశానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తుంగలో తొక్కి కులాల మధ్య చిచ్చుపెట్టడమే తప్ప సామాజిక న్యాయం కూటమి ప్రభుత్వానికి చేతకాదని విమర్శించారు. ఆర్డినెన్స్‌కు టీడీపీ మాల నాయకులు మద్దతు పలకడం మాలజాతికి ద్రోహం చేసినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ సుంకర సీతారామ్, గౌరవాధ్యక్షుడు బీరా మధు, మండల జేఏసీ నాయకుడు కోట వెంకటేశ్వరరావు, జెంత్రీ శ్రీను, మట్టా చంటి, గుండే నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లో కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇళ్ల బాధితులకు ప్రత్యామ్నాయం చూపాలి

భీమవరం: ఉండి ఎమ్మెల్యే ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరును ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా కమిటీ విమర్శించింది. పాలకోడేరు మండలం ఏఎస్ఆర్ నగర్‌లో పేదల ఇళ్లను ప్రభుత్వం అక్రమంగా తొలగించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఉండి నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాల్లో నివసించే పేదలను తరిమికొట్టి, ఇళ్లను అక్రమంగా కూలగొట్టడం చూస్తుంటే కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తీరు అర్థమవుతుందన్నారు. అభివృద్ధికి అడ్డంగా పేదల ఇళ్లే కనిపిస్తున్నాయా అని ఎండగట్టారు. జిల్లాలో నీటి కాలుష్యం, వ్యర్థ కాలుష్యం, ఆహార కాలుష్యాన్ని అరికట్టే దమ్ముందా అని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ కాలువ గట్లు, రోడ్ల పక్కన నివసించే ప్రజలకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించి ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు.

పేద ముస్లింల కోసమే వక్ఫ్ చట్టం



భీమవరంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

భీమవరం: పేద ముస్లింలకు న్యాయం జరగాలనే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం తీసుకువచ్చిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర బీజేపీ ముద్రించిన వక్ఫ్ సవరణ చట్టం ప్రయోజనాలను తెలియజెప్పే కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా 20 వేల కరపత్రాలను అన్ని మండలాల అధ్యక్షులకు పంపిస్తామని, ముస్లింలలో ఈ చట్టంపై ఉన్న సందేహాలు తొలగిపోయేలా అన్ని వివరాలు ఇందులో పొందుపరిచినట్టు జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి అన్నారు. భీమవరం తూర్పు అధ్యక్షుడు అడబాల శివ, పడమర అధ్యక్షుడు వబిలిశెట్టి ప్రసాద్, షేక్ మొహిద్దీన్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, గోవర్ధన్ కుమార్ పాల్గొన్నారు.



కాళ్ల : జువ్వలపాలెంలో సమాధుల తోటలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



పెంటపాడు: తాడేపల్లిగూడెం పాతూరులోని సమాధుల తోటల్లో కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు

మహోదయం.. ఏసు పునరుత్థానం

కరుణామయుడు ఏసు పునరుత్థానానికి చిహ్నంగా క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. సమాధుల తోటలను ప్రత్యేకంగా అలంకరించి తమ కుటుంబసభ్యుల కోసం వేకువజామున కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిల్లో విశేషంగా అలంకరించిన వేదికలపై క్రీస్తును ఆహ్వానిస్తూ ప్రార్థనలు నిర్వహించారు. క్షమ, కరుణ, సహనానికి ప్రతీక ఈస్టర్ అని మత పెద్దలు ఉద్బోధించారు. – సాక్షి నెట్‌వర్క్

పేదలకు అప్పుల తిప్పలు

పనులు లేక.. సంక్షేమం కానరాక..

- అప్పుల బాటపడుతున్న ప్రజలు
- విద్య, వైద్యానికి వడ్డీ వ్యాపారుల చెంతకు..
- నామమాత్రంగానే కార్పొరేషన్ రుణాలు
- పథకాలపై కూటమి కత్తి
- గత ఐదేళ్లలో సంక్షేమం పరవళ్లు

భీమవరానికి చెందిన లక్ష్మి అనే మహిళ నాటి జగన్ ప్రభుత్వంలో అమలు చేసిన వైఎస్సార్ చేయూత ఆర్థిక సాయంతో అద్దెకు షాపు తీసుకుని చిన్నపాటి బట్టల దుకాణం పెట్టుకుంది. నాలుగేళ్ల పాటు ప్రభుత్వ ఆర్థిక సాయం అందడం, కొనుగోళ్లు బాగుండటంతో వ్యాపారం బాగా జరిగింది. భర్త సంపాదనతో పాటు ఆమె ఆదాయంతో కుటుంబ చక్కగా నడిచింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడంతో కొనుగోళ్ల లేక షాపు అద్దె చెల్లించడం కూడా భారంగా మారింది. దీంతో ఆమె బట్టల దుకాణం మూసివేసే పరిస్థితి వచ్చింది.

పాలకోడేరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ కుటుంబం పిల్లల ఫీజులు, డ్వాక్రా రుణాల చెల్లింపు కోసం ప్రైవేట్ బ్యాంకు వద్ద రూ.50 వేలు రుణం తీసుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక కొరతతో కొన్ని నెలలు భవన నిర్మాణ పనులు, వ్యవసాయ పనులు సరిగా లేక జీవనం కష్టంగా మారింది. ఈ పరిస్థితిలో వారం వారం బ్యాంకు వాయిదాలు సరిగా చెల్లించక పోవడంతో బ్యాంకు సిబ్బంది ఒత్తిళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కుటుంబాలు జిల్లాలో వందలాదిగా ఉన్నాయి.

భీమవరం(ప్రకాశం చౌక్): కూటమి ప్రభుత్వ పాలనలో పనులు లేక.. చిరు వ్యాపారాలకు పెట్టుబడులు దొరక్క.. సంక్షేమ పథకాలు అందక.. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం రాక.. పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు యంత్రాలతో చేస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు చేతినిండా పని దొరకని పరిస్థితి. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారం కాగా.. పిల్లలు చదువులు, వైద్యం, ఇతర ఖర్చులకు అప్పుల బాటపడుతున్నారు. కుటుంబ పోషణ, డ్వాక్రా రుణాల చెల్లింపునకు మహిళలు బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. ప్రైవేట్ బ్యాంకులు ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంట్‌ల ఖర్చు, బీమా తదితరాల కింద 10 శాతం రుణంలో మినహాయించుకుని ఇస్తున్నాయి. వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. 2014లో చంద్రబాబు పాలనలోనూ ఇదే తరహా పరిస్థితులు ఉండగా అప్పట్లో చాలా మంది ప్రైవేట్ బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల వేధింపులతో కాల్‌మనీ వ్యవహారంలో ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు పేదలకు కేవలం డ్వాక్రా రుణాలతోనే సరిపెడుతున్నాయి.

సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 10 నెలలు గడిచినా ఇప్పటికీ ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. కేవలం పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ హామీలు మినహా మిగిలినవి అటకెక్కించింది. దీంతో ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయింది. వ్యాపారాలూ అంతంతమాత్రంగా సాగుతున్నాయి. ప్రధానంగా మహిళలకు ఎలాంటి పథకాలు అందడం లేదు.

కంటి తుడుపుగా కార్పొరేషన్ రుణాలు

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయకుండా నామమాత్రంగా బీసీ, ఎస్సీ, కాపు కార్పొరేషన్ రుణాల పేరిట గ్రామం, వార్డుకు ఇద్దరు ముగ్గురికి చొప్పున రుణాలు ఇచ్చి చేతులు దులుపుకునే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. దీంతో అర్హులకు రుణాలు అందని పరిస్థితి.



జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
చేయూత	2,72,111	552.88
ఆసరా	1,02,352	1,067.35
అమ్మఒడి	2,25,525	597.62
కాపు నేస్తం	2,24,286	79.40
ఈబీసీ నేస్తం	12,286	19.02
సున్నా వడ్డీ రుణాలు	2,64,719	14.02
సున్నా వడ్డీ (డ్వాక్రా)	11,65,513	110.51
నేతన్న నేస్తం	2,286	10.98

గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు పేద, మధ్యతరగతి ప్రజలకు క్రమం తప్పకుండా సంక్షేమ పథకాల లబ్ధి అందింది. ముఖ్యంగా మహిళల పేరిట పథకాలను అమలు చేయడంతో కుటుంబ జీవనానికి, పిల్లల చదువులకు ఇబ్బందులు ఉండేవి కావు. కరోనా విపత్తు సమయంలోనూ రెండేళ్ల పాటు సంక్షేమ పథకాలు ఎన్నో పేద కుటుంబాల జీవనానికి భరోసాగా నిలిచాయి. వైఎస్సార్ చేయూత, ఆసరా (డ్వాక్రా రుణమాఫీ), అమ్మఒడి, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం పథకాల సాయంతో ఎందరో మహిళలు స్వయం ఉపాధికి బాటలు వేసుకున్నారు. పిల్లల స్కూల్, కళాశాల ఫీజులు, వైద్య ఖర్చులు కూడా నాటి ప్రభుత్వం భరించడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం ఉండేది కాదు. దీంతో వారు అప్పులు చేసే పరిస్థితులు లేవు. అయితే ప్రస్తుతం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది.

గృహ నిర్బంధం దారుణం

భీమవరం : పాలకోడేరు ఏఎస్ఆర్ నగర్‌లో పే**దల ఇళ్ల తొలగింపు**ను అడ్డుకుంటున్న సీపీఎం **జిల్లా కార్యదర్శి జే**ఎన్‌వీ గోపాలన్, మండల **కార్యదర్శి శేషపు** అత్రియ్యను ఆదివారం పోలీ**సులు గృహ నిర్బంధం** చేశారు. శనివారం ఇళ్ల **తొలగింపును ప్రా**రంభించగా పేదలు, సీపీఎం **నాయకులు గట్టిగా** అడ్డుకోవడంతో వెనక్కి **తగ్గిన అధికారులు** ఆదివారం వేకువజామునే **పెద్ద ఎత్తున పోలీ**సులను మోహరించి య**ంత్రాలతో ఇళ్ల తొల**గింపు చేపట్టారు. ఈ సంద**ర్భంగా గృహ నిర్బ**ంధంలో ఉన్న గోపాలన్ **మాట్లాడుతూ** పేదల ఇళ్లను అన్యాయంగా తొలగిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు, ఈస్టర్ పండుగ రోజున పేదలకు కానుకగా ఇళ్లు తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపద సృష్టించి పేదలకు పంచుతామంటూ, పేదరిక నిర్మూలన చేస్తామని చంద్రబాబు చెబుతుంటే ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అసలు పేదలే లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి నాయకులు పేదలను ఇబ్బందులు పాలుచేస్తుంటే ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అహంకారంతో ఆకివీడు నుంచి పాలకోడేరు వరకు వందలాది మంది పేదల ఇళ్లు దుర్మార్గంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. దీనిని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నియంత్రించలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇలానే పేదలను ఇబ్బందులు పాలు చేస్తే కూటమి ప్రభుత్వం పతనం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా పేదలపై దాడులు, సీపీఎం నాయకుల గృహ నిర్బంధాలను అరికట్టాలని గోపాలన్ డిమాండ్ చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

నూజివీడు : మైనర్లకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వొద్దని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి మైనర్లు నడుపుతున్న ద్విచక్ర వాహనలను స్వాధీనం చేసుకున్నారు. మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను పట్టణ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి శనివారం రాత్రి కౌన్సెలింగ్ ఇచ్చారు.

వాచ్‌మేనే వైద్యుడు



పెనుగొండ సీహెచ్‌సీలో బాలుడికి వైద్యం చేస్తున్న వాచ్‌మేన్

పెనుగొండ: అది 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్.. జనరల్ ఫిజీషియన్ తప్ప మిగిలిన అన్ని విభాగాల్లోనూ వైద్యులు ఉన్నారు. అయితే ఆదివారం, పండుగ రోజుల్లో వైద్యులు అందుబాటులో ఉండరు. నర్సులు కనీసం ప్రథమ చికిత్స కూడా చేయరు. దీంతో బాధితులకు వాచ్‌మేన్ వైద్యం అందిస్తుంటారు. ఇది పెనుగొండ సీహెచ్‌సీలో పరిస్థితి. వివరాల్లోకి వెళితే.. ములపర్రులో ఆదివారం బాలుడు శ్రీనివాస్ సైకిల్‌పై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో తలకు గాయమైంది. దీంతో శ్రీనివాస్‌ను మేనమామ ప్రదీప్ మోటార్‌సైకిల్‌పై పెనుగొండ సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ఇక్కడ డాక్టర్ అందుబాటులో లేకపోగా కనీసం నర్సులు బాలుడిని పరీక్షించి ప్రథమ చికిత్స అందించే పరిస్థితి లేకపోవడంతో అవాక్కయ్యారు. నర్సులు కనీసం చూడకపోవడంతో వాచ్‌మేన్ వచ్చి గాయపడిన బాలుడి తలను శుభ్రం చేసి బ్యాండేజ్ వేశారు. నర్సులు బాలుడిని కనీసం ముట్టుకోకుండా మందులు ఇచ్చి పంపించడం విశేషం. ఇది దారుణమంటూ బాలుడి కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. వాచ్‌మేన్ వైద్యం చేయడం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

మధుర ఫలం.. ధర పతనం



ఎగుమతికి సిద్ధంగా ఉన్న కలెక్టర్ రకం మామిడి కాయలు

మామిడి.. తడబడి

- బంగినపల్లి, కలెక్టర్ రకాల ధరలు దారుణం
- దిగుబడి తక్కువే.. ధరా తక్కువే..
- ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల డిమాండ్.

నూజివీడు: మామిడి దిగుబడి ఈ ఏడాది తక్కువగా ఉన్న నేపథ్యంలో ధర ఎక్కువగా ఉంటుందన్న మామిడి రైతుల, తోటలు కొనుగోలు చేసిన వ్యాపారుల ఆశలు అడియాశలవుతున్నాయి. పండ్లలో రారాజుగా కీర్తిని సంపాదించుకున్న మామిడిని సాగు చేసిన రైతులకు నష్టాలను పంచుతోంది. రోజురోజుకూ మామిడి ధరలు పతనమవుతుండటంతో ఏంచేయాలో తెలియని అగమ్యగోచర స్థితిలో మామిడి రైతులు, వ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు. మామిడి దిగుబడి ప్రారంభమైన ఫిబ్రవరి ద్వితీయార్థంలో మామిడి ధరలు బాగానే ఉన్నా రానురానూ పతనమవుతూ రైతులకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. కాయలకు డిమాండ్ ఉన్నా ధర మాత్రం పెరగడం లేదు. దీనంతటికీ మామిడి కాయలు కొనుగోలు చేసే సేట్‌లు సిండికేట్ కావడమే కారణమని రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. మరోవైపు ఈదురుగాలులు వీచి ఉన్న కాయలు ఎక్కడ రాలిపోతాయోనని రైతులు, తోటలు కొనుగోలు చేసిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

సీజన్ ప్రారంభంలో రూ.1.20 లక్షలు

మామిడి సీజన్ ప్రారంభమైన ఫిబ్రవరి ద్వితీయార్థంలో ముంబై మార్కెట్‌లో బంగినపల్లి రకం టన్ను రూ.1.20 లక్షల ధర పలికింది. క్రమేణా ఆ ధర రూ.90 వేలకు, రూ.60 వేలకు తగ్గి ప్రస్తుతం రూ.30 వేల నుంచి రూ.40 వేలు పలుకుతోంది. దీంతో కిరాయిలు, కోతఖర్చులు పోను రైతులకు గిట్టుబాటు కావడం లేదు. కలెక్టర్ (తోతాపురి) రకం పరిస్థితి సైతం అలాగే ఉంది. టన్ను ధర రూ.9 వేల నుంచి రూ.11 వేలు మాత్రమే లభిస్తోంది. పెట్టుబడులు పెరగడం, దిగుబడి పడిపోవడం, ధర తగ్గడంతో తోటలను కొనుగోలు చేసిన వ్యాపారులు, రైతులు లబోదిబోమంటున్నారు.

స్థానిక మార్కెట్‌లలో సైతం..


మామిడి దిగుబడి లేనప్పటికీ స్థానికంగా ఏర్పాటు చేసిన కమీషన్ దుకాణాల్లో కూడా ధర తక్కువగానే ఉంది. ఆగిరిపల్లి మండలం ఈదర, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం, విస్సన్నపేటలో మామిడి కమీషన్ దుకాణాలు ఉన్నాయి. అక్కడ కూడా బంగినిపల్లి టన్నుకు రూ.20 వేల నుంచి రూ.25 వేల ధర మాత్రమే లభిస్తోంది. అలాగే తోతాపురికి రూ.9 వేలు లభిస్తోంది. లోకల్ దుకాణాల్లో సూటు పేరుతో టన్నుకు 100 కిలోల కాయలను తీసుకుంటున్నారని, కమీషన్ 10 శాతం వసూలు చేస్తున్నారని, వీటితో పాటు హమాలీ చార్జీలు తీసుకుంటుండటంతో రైతుకు మిగిలేది ఏమీ ఉండటం లేదని రైతులు అంటున్నారు. విజయవాడ సమీపంలోని నున్న మార్కెట్‌కు కాయలను తరలించే వారే కనిపించడం లేదు. ఇంతటి దారుణమైన పరిస్థితులు గతంలో ఎన్నడూ లేవని, అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయమని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మామిడి రైతులకు ఈ ఏడాది ఆదాయం పూర్తిగా పడిపోయిన క్రమంలో ప్రభుత్వం ఆదుకోవాలనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. మిగిలిన పంటలకు మాదిరిగా మామిడికి కూడా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మామిడి పంట లాటరీగా మారిందని, ఇవే పరిస్థితులు కొనసాగితే రాబోయే రోజుల్లో మామిడి పంట మనుగడ ప్రశ్నార్థకరంగా మారనుందని వాపోతున్నారు.

కాపు కలవరపాటు

మామిడికి పెట్టింది పేరైన నూజివీడు నియోజకవర్గంతో పాటు చింతలపూడి ప్రాంతంతో కలుపుకుంటే జిల్లాలో 45 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. పూతలు బాగా వచ్చినా అందులో 20 శాతం కూడా పిందె నిలవలేదు. దీంతో దిగుబడి పూర్తిగా పడిపోయింది. అయితే దిగుబడి తక్కువగా ఉన్న నేపథ్యంలో ధర బాగా ఉంటుందనుకుంటే అది కూడా లేకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రోజురోజుకూ ధర తగ్గుతూ..



ఈ ఏడాది మామిడి దిగుబడి బాగా తగ్గినా ధర పెరగకుండా తగ్గుతోంది. రోజురోజుకూ ధర తగ్గిపోతుండటంతో పెట్టుబడులు కూడా వస్తాయోరావోనని ఆందోళన పెరుగుతోంది. రసాయన మందుల పిచికారీ, తోట కాపలా, ఇతర ఖర్చులు కలిపి పెట్టుబడులు తడిసి మోపెడవుతుండగా మామిడికి మాత్రం ధర పెరగడం లేదు.

– యర్రంశెట్టి రవితేజ, నూజివీడు

నిరాశాజనకంగా ధరలు



ఈ ఏడాది కాపు తక్కువగా ఉండటంతో ధర ఎక్కువగా ఉంటుందని అనుకున్నాం. అయితే ఇప్పుడు పరిస్థితిని చూస్తే ఏమాత్రం ఆశాజనకంగా లేదు. సేట్‌లందరూ సిండికేట్ అయ్యి ధరను తగ్గించేస్తున్నారు తప్పితే పెంచడం లేదు. దీంతో పెట్టుబడులు ఏ మాత్రం రావు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలి.

– బాణావతు రాజు, లైన్‌తండా, నూజివీడు మండలం

క్లుప్తంగా

రాట్నాలమ్మకు రూ.56,105 ఆదాయం


ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: రాట్నాలమ్మకు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వేంచేసిన రాట్నాలమ్మను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.26,300, విరాళంగా రూ.4,230, లడ్డూ ప్రసాదంపై రూ.23,175, ఫొటోల అమ్మకంపై రూ.2,400 కలిపి మొత్తం రూ.56,105 ఆదాయం లభించిందని దేవస్థాన ఈవో ఎస్.సతీష్‌కుమార్ చెప్పారు.

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న గుబ్బల మంగమ్మ సన్నిధి

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు విజయవాడ, మచిలీపట్నం, తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు వాహనాలతో తరలివచ్చి దూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మంగమ్మతల్లి గుడి భక్తులతో కిటకిటలాడింది. దర్శనానికి సుమారు 3 గంటల సమయం పట్టింది. క్యూలో నిలుచున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ స్వాధీనం

భీమడోలు: కోడి వ్యర్థాలు తరలిస్తున్న ముగ్గురిని ఆదివారం భీమడోలు పోలీసులు అరెస్ట్ చేశారు. ఐషర్ వ్యాన్‌ను సీజ్ చేశారు. విజయవాడకు చెందిన ఎం.రాంబాబు, ముసునూరు మండలం రంగంపేటకు చెందిన పిల్లి వెంకట రమణ హైదరాబాద్ నుంచి కోడి వ్యర్థాలను లింగంపాడులోని గంటా మోహనరావు ఆక్వా చెరువుకు తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వై.సుధాకర్ తన సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని.. వాహనాన్ని సీజ్ చేసారు.

కళావిహీనం.. ఆటపాక కేంద్రం

- నీటి కోసం అల్లాడుతున్న పక్షులు
- నిలిచిన బోటు షికారు
- చెరువు నీటిని నింపడంలో అధికారులు విఫలం


ఆటపాక పక్షుల విహార కేంద్రంలో నీరు లేక నిలిచిన షికారు బోట్లు


చెరువులో నీరు లేక బీటలు వారుతున్న దృశ్యం

కైకలూరు: రాష్ట్రంలో పక్షి ప్రేమికుల స్వర్గధామంగా ఉన్న ఆటపాక పక్షుల విహార కేంద్రం కళావిహీనంగా మారింది. తీవ్ర నీటి కొరతతో పక్షులు అల్లాడుతున్నాయి. ఆహారం, ఆవాసం కోసం ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నాయి. ఏటా నీటి కొరత ఏర్పడుతుందని తెలిసినా ముందస్తు చర్యలు చేపట్టడంలో అటవీ అధికారులు అలసత్వం వహిస్తున్నారని పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. ఆటపాకలో బోటు షికారు నిలిచిపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు నిరుత్సాహంతో తిరిగి వెళ్తున్నారు.

ప్రపంచంలోనే అరుదైన పెలికాన్(గూడబాతు) పక్షులు ఆటపాక పక్షుల కేంద్రానికి సంతానోత్పత్తి కోసం వలస వస్తాయి. దీంతో ఈ కేంద్రాన్ని పెలికాన్ ప్యారడైజ్‌గా పిలుస్తారు. పక్షుల విహారానికి 286 ఎకరాల విస్తీర్ణంలో పెద్ద చెరువు ఇక్కడ అందుబాటులో ఉంది. విదేశీ పక్షుల గూడు నిమిత్తం, సంతానోత్పత్తికి వీలుగా 156 కృత్రిమ ఇనుప స్టాండ్లను అటవీశాఖ ఏర్పాటు చేసింది. కొల్లేరులో సాధారణంగా పెలికాన్, పెయింటెడ్ స్టార్క్, టీల్స్, నైట్ హెరాన్, కింగ్ ఫిషర్స్, గ్లోబీ ఐబీస్, స్టిల్ట్, షావలర్స్, స్పూన్ బిల్స్ వంటి దాదాపు 189 రకాల పక్షులు విహరిస్తాయని అంచనా. పక్షుల సంతానోత్పత్తికి ఆటపాక పక్షుల కేంద్రం అనుకూలంగా ఉండటంతో ఎక్కువగా పక్షులు విచ్చేస్తున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన కేంద్రాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి సర్వత్రా వినిపిస్తున్నాయి.

గట్లు ఎత్తు పెంచాలి

ఆటపాక పక్షుల కేంద్రంలో ప్రధానమైంది విహార చెరువు. కొల్లేరు ఆపరేషన్ తర్వాత ఈ ప్రాంతంలో తొలగించిన చెరువులన్నింటినీ ఒక్కటిగా చేయడంతో చెరువు విస్తీర్ణం మరింతగా పెరిగింది. సాధారణంగా చెరువులో 6 అడుగులు నీటిని నిల్వ చేసుకోవచ్చు. గట్లు బలహీనంగా ఉండటంతో 4 అడుగులకు మించడం లేదు. ఏప్రిల్, మే నెలల్లో చెరువు పూర్తిగా అడుగంటుతోంది. పక్షులు ఆహారంగా తీసుకునే చేపలు చనిపోతున్నాయి. చెరువు గట్లు ఎత్తు పెంచాలని ప్రతిపాదనలు పంపుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. మే నెలలో ఏకంగా చెరువు బీటలు వారుతోంది. దీంతో పక్షులకు ఆహార కొరత ఏర్పడడంతో కొన్ని సందర్భాల్లో మరణాలు సంభవిస్తున్నాయి.

నీటి తరలింపులో జాప్యం

ఏటా పక్షుల కేంద్రం చెరువులో నీటిని నింపడం పెద్ద ప్రహసనంలా మారుతోంది. సమీప కోమటిలంక నాగరాజు డ్రెయిన్ నుంచి పక్షుల కేంద్రం చెరువుకు నీటిని నింపుతారు. వర్షాలు అధికంగా కురిస్తే డ్రెయిన్‌లో నీరు పెరుగుతుంది. ఆ సమయంలో తూములు తీసి చెరువుకు నీటిని పంపుతారు. ప్రస్తుతం నాగరాజు డ్రెయిన్ నీటిలో 8కిపైగా ఉప్పు శాతం ఉందని పరీక్షల్లో తేలింది. ఈ నీటిని నింపితే చెరువులో సహజసిద్ధంగా పెరిగిన చేపలు మరణిస్తాయి. ఈ కారణంతో నీటిని నింపడం లేదు. ఆటపాక గ్రామం పంట కాల్వ నుంచి నీటిని పైపుల ద్వారా నేరుగా పక్షుల కేంద్రం చెరువులోకి తరలించాలని ప్రతిపాదనలు చేస్తున్న ఆచరణ సాధ్యం కావడం లేదు. అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ పక్షుల కేంద్రాన్ని స్వయంగా సందర్శించి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఆటపాక పక్షుల కేంద్రంలో చెరువు గట్ల ఎత్తు పెంచడానికి ప్రతిపాదనలు పంపించాం. కోమటిలంక సమీప గట్లను మరమ్మతులు చేయించాం. చెరువు విస్తీర్ణం అధికంగా ఉండటంతో పూర్తి స్థాయిలో నీటిని నింపడానికి సాధ్యాసాధ్యాలను పరిశీస్తున్నారు. ప్రస్తుతం ఆటపాకలో నీరు అడుగంటింది. బోటు షికారు నిలిపేశాం. చెరువులో పక్షుల ఆహారానికి కొరత లేదు.

– ఎం.రంజిత్‌కుమార్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కైకలూరు.

వేసవికి ముందుగానే నీటిని నింపాలి



వేసవికి ముందుగానే అటవీ అధికారులు ఆటపాక పక్షుల చెరువులో నీటిని నింపాలి. ఆటపాక పంట కాల్వ నుంచి రామాలయం మీదుగా నేరుగా పక్షుల కేంద్రం చెరువుకు అండర్ గ్రౌండ్ పైపులైన్లు ఏర్పాటు చేయాలి. పోల్‌రాజ్ డ్రెయిన్(నాగరాజు కాల్వ) నుంచి వర్షాల సమయంలో నీటిని చెరువులో నింపేందుకు మరిన్ని లాకులను ఏర్పాటు చేయాలి.

– ఎల్ఎస్.భాస్కరరావు, ప్రజాస్వామ్య పరిరక్షణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రామాలయంలో బంగారు అభరణాల అపహరణ


గుండుగొలను వద్ద దొంగను అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: కోరుకొల్లు పంచాయతీ శివారు రత్నాపురంలోని రామాలయంలో బంగారు వస్తువులను దొంగిలించిన వ్యక్తిని భీమడోలు పోలీసులు శనివారం రాత్రి అరెస్ట్ చేశారు. దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కోరుకొల్లు పంచాయతీ పరిధిలోని రామాలయంలో ఈనెల 14న రాత్రి గుడి తలుపుల తాళాలు పగులకొట్టి సుమారు 17 గ్రాముల బంగారు వస్తువులను పాలకొల్లు మండలం పూలపల్లికి చెందిన కట్టా సుబ్బారావు చోరీ చేసాడు. ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వై.సుధాకర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఈ నెల 19న రాత్రి గుండుగొలను వద్ద కట్టా సుబ్బారావును పట్టుకున్నారు. అతని నుంచి చోరీ సొత్తును రికవరీ చేసి భీమడోలు కోర్టులో హాజరుపర్చారు.

అన్యాయంగా ఇళ్లను తొలగిస్తున్నారు


లంకపేటలో ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

భీమవరం: పాలకోడేరు మండలం ఎస్ఆర్ నగర్‌లో అన్యాయంగా పేదల ఇళ్లను ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు తొలగిస్తున్నారని, పేదలకు అండగా ఉన్న సీపీఎం నాయకులను అన్యాయంగా అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో లంకపేటలో ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ నాయకుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా ఉంటున్న పేదల ఇళ్లను నోటీసు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయ స్థలాలు చూపకుండా తొలగించారని, 130 కుటుంబాల ప్రజలు నిరాశ్రయులయ్యారన్నారు. ఉండి ఎమ్మెల్యే పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా.. పేదల ఇళ్లను పీకి పడేస్తున్నారని విమర్శించారు. రానున్న కాలంలో ప్రజలు ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సీపీఎం నాయకులు మల్లిపూడి ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పాటు విద్య, విజ్ఞానం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): శశి విద్యా సంస్థల్లో క్రమశిక్షణతో పాటు విద్య, విజ్ఞానం నేర్పిస్తామని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ అన్నారు. శశి తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో 7, 8, 9, 10, 10 ప్లస్ 1 విద్యార్థుల కోసం ఐఐటీ, నీట్‌పై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. దాదాపు 5 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సదస్సులో వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులను ఒత్తిడి చేయకుండా వారు ఏదైతే చేయగలుగుతారో ఆ కోర్సులు మాత్రమే చేయగలిగేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సంస్థ వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ స్కూల్‌కి మార్కులు, ర్యాంకులు కోసమే కాకుండా విజ్ఞానం కోసం పంపాలని చెప్పారు. విద్యార్థులు ఫోన్ అవసరానికి వాడాలని, బానిస కాకూడదన్నారు. ఐఐటీ, నీట్‌పై తల్లిదండ్రులు అడిగిన సందేహాలు నివృత్తి చేశారు. సదస్సులో డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, క్యాంపస్ ఇన్‌చార్జి కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథపట్నంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు


గోపినాథపట్నంలో శివుడికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం భక్తాంజనేయ స్వామి ఆలయ క్షేత్రంలో నూతనంగా నిర్మించిన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆయన సతీమణి సాదిని కుమారి రెండో రోజు ఆదివారం విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. శృంగేరి పీఠంలో పీఠాధిపతి చేత అభిషేకాలు, పూజలు అందుకున్న శివలింగం ఆదివారం ఇక్కడికి చేరుకుంది. పంచామృతాలతో విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం జలాదివాసం నిర్వహించారు. విశేష పూజల నడుమ ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గోపాలకృష్ణ చక్రవర్తి బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో భక్తజన సందోహం


శ్రీవారి దర్శనానికి క్యూలైన్ల ద్వారా వెళుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: సెలవుదినం కావడంతో ద్వారకాతిరుమల క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తుల తాకిడి మొదలైంది. దానికి తోడు ఆలయ అనివేటి మండపంలో, పరిసర ప్రాంతాల్లో వివాహాలు, ఒడుగులు, అన్నప్రాసన వేడుకలు పెద్ద ఎత్తున జరిగాయి. దాంతో క్షేత్ర పరిసరాలు కళకళలాడాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం సిబ్బంది మజ్జిగ అందజేశారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై వీరిశెట్టిగూడెంకు చెందిన జానపద వృత్తి కళాకారుల సంఘం వారు నిర్వహించిన భజనలు భక్తులను అలరించాయి. క్షేత్రంలో రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

కొల్లేరు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: కొల్లేరు సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. ఇటీవల కొల్లేరు సమస్యపై సుప్రీంకోర్టు 12 వారాల గడువు ఇవ్వడంపై వడ్డీ సాధికారిత రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు అధ్యక్షతన కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ఏలూరు జిల్లా కొల్లేరు పెద్దలతో సమావేశం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ(సీఈసీ)ని సుప్రీంకోర్టు క్షేత్రస్థాయిలో కొల్లేరు సమస్యపై నివేదిక కోరిందన్నారు. త్వరలో సీఈసీ సభ్యులు కొల్లేరు అధ్యయనానికి వస్తారన్నారు. ఆయా గ్రామాల ప్రజలు అర్జీలతో సమస్య చెప్పడానికి సిద్ధంగా ఉండాలన్నారు. పర్యావరణంతో పాటు ఇక్కడ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలనే వాదాన్ని ప్రజాప్రతినిధులందరూ తెలుపుతున్నామన్నారు. కొల్లేరు అభయారణ్య విస్తీర్ణం 77,535 ఎకరాలను 55,000గా నిర్ణయించి మిగిలినవి కొల్లేరు పేదలకు పంపిణీ జరిగేలా కృషి చేస్తామన్నారు. కొల్లేరు తరపున సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ చేపల రైతుల సంఘం దాఖలు చేసిందని, దాంతో పాటు కొల్లేరు సంఘాల తరుపున ఇంప్లీడ్‌కు అవకాశం కల్పించాలని నాయకులు కోరారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు వడ్డీల సాధికారిత కన్వీనర్ బలే ఏసురాజు, సాహితీవేత్త వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బుకీల అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: పట్టణ శివారు ప్రాంతంలో క్రికెట్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎం.వెంకట్రావు, వై.వెంకట్‌ను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ డాక్టర్ శ్రీవేద అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. వీరు కొంత కాలంగా మరో ఇద్దరితో కలిసి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నారన్నారు. వీరి నుంచి ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, రూ.33 వేల నగదు, కారు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కన్నీటి కెరటాలు

‘అదిగదిగో ఆ నావ దగ్గర్లోనే.. పాకలో బడి ఉండేది. వంద అడుగుల దూరంలో రామాలయం, పక్కనే మా ఇళ్లు. ఊరి చుట్టూ సరుగుడు, కొబ్బరి తోటలు, మడ అడవులు. పొలాల్లో పంటలు పండించేవాళ్లం. చేపల వేట కోసం అంతా కలిసి వెళ్లేవాళ్లం. వంతెన కట్టాక ఊరికి బస్సు వచ్చేది. సముద్రం మా ఊరి వైపు చొచ్చుకురావడంతో బడి, గుడి, ఇళ్లు, పొలాలు, తోటలు మునిగిపోయాయి. 2004 సునామికి మొత్తం ఊరే లేకుండా పోయింది’ అంటూ గతాన్ని గుర్తుచేసుకున్నాడు చినమైనివానిలంకకు చెందిన 72 ఏళ్ల రాముడు. సముద్రాన్ని చూస్తే పాత జ్ఞాపకాలే గుర్తుకు వస్తాయంటాడు. ఆయనే కాదు.. చినమైనివానిలంక, బియ్యపుతిప్ప గ్రామాల్లోని పాత తరం వారికి ఎదురుగా కనిపించే కడలి కెరటాల్లో వారి జ్ఞాపకాలు కదలాడుతుంటాయి. సముద్రపు కోత కట్టడికి రక్షణ గోడ నిర్మాణం కోసం సర్వే పనులు జరుగుతున్న నేపథ్యంలో కడలి కబళించిన రెండు గ్రామాలపై ‘సాక్షి’ కథనం

- పశ్చిమలో తీరంలో చొచ్చుకొస్తున్న సముద్రం
- 20 ఏళ్ల క్రితం బియ్యపుతిప్ప, చినమైనివాలంకను కబళించిన కడలి
- తీరంలో రక్షణ గోడ కోసం 2022లో చర్యలు
- రూ.35 కోట్లతో కిలోమీటరు మేర పనులకు సన్నాహాలు


నాటి జ్ఞాపకాలకు గుర్తుగా మిగిలిన చినమైనివానిలంక తుఫాన్ షెల్టర్(ఫైల్)


చినమైనివానిలంక కొత్త ఊరు


రెండేళ్ల క్రితం బయటపడిన బ్రిడ్జి (ఫైల్)

సాక్షి, భీమవరం/ నరసాపురం రూరల్: జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 19 కిలోమీటర్లు సముద్ర తీరం ఉంది. శివార్లతో కలిపి 12 తీర గ్రామాలున్నాయి. ఇప్పుడున్న చినమైనివానిలంక, బియ్యపుతిప్ప కొత్తగా ఏర్పడినవి.. ఈ రెండు పాత ఊళ్లు రెండు దశాబ్దాల క్రితమే కడలి గర్భంలో కలిసిపోయాయి. గుర్తుగా మిగిలింది శిథిలమైన తుఫాను షెల్టర్ మాత్రమే. 1969 నుంచి 94 వరకు ఈ రెండు పాత గ్రామాలతో పాటు ఐదు గ్రామాలకు సర్పంచ్‌గా సేవలందించిన కొండేటి రామకృష్ణారావు, 1995లో సర్పంచ్‌గా చేసిన వాతాడి బ్రహ్మానందం, స్థానికుల నుంచి సేకరించిన వివరాలు మేరకు..

అప్పట్లో చినమైనివాలంకలో దాదాపు 170, బియ్యపుతిప్పలో 150 వరకు మత్స్యకార కుటుంబాలు ఉండేవి. రెండు గ్రామాలకు మూడు వైపులా సముద్రం, మరో పక్క నల్లి క్రీక్ డ్రైన్‌తో దీవుల మాదిరి ఉండేవి. ప్రజల రాకపోకల నిమిత్తం పంచాయతీ నావలు నడిపేది. రెండు గ్రామాల్లో పాకల్లో బడులు నిర్వహించేవారు. రామాలయాలు, వనువులమ్మ తల్లి ఆలయం ఉండేవి. చేపల వేట జీవనాధారం కాగా దాదాపు ప్రతి కుటుంబానికి ఎంతో కొంత సాగు భూమి ఉండేది. వేరుశనగ, నువ్వులు, రాగులు, ఇతర పంటలు, ఉప్పు పండించేవారు. 1969లో భారీ తుఫాన్ తాకిడికి బియ్యపుతిప్ప సమీపంలో ఇసుక మేట వేయడం, నీరు రెండు గ్రామాల వైపు చొచ్చుకురావడం మొదలైంది. అప్పట్లోనే చినమైనివాలంక ప్రజల కోసం ఇప్పుడున్న ఊరిలో 10.5 ఎకరాలు, బియ్యపుతిప్పలోనూ 5.5 ఎకరాల భూమిని సేకరించి స్థలాలు ఇచ్చారు. మొదట్లో ఇక్కడకు వచ్చేందుకు ఎవరూ సుముఖత చూపకపోయినా సముద్రపు కోతతో ఇళ్లు మునిగిపోవడంతో కొత్త ఊళ్లకు వచ్చేశారు.

1987–90 మధ్యకాలంలో వెస్ట్‌కొక్కిలేరుపై వంతెన నిర్మాణంతో చినమైనివానిలంకకు బస్సు కూడా నడిచేది. ఆయా ఊళ్లకు పంచాయతీ నుంచి విద్యుత్, తాగునీటి పైప్‌లైన్లు ద్వారా మంచినీటి సరఫరా చేసేవారు. రోడ్లు సదుపాయం కల్పించారు. 2004 డిసెంబరు 26న సునామీకి ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. ప్రస్తుతం ఇక్కడ కనిపించే తుఫాను షెల్టర్ నుంచి అరకిలోమీటరు వరకు గ్రామం, తర్వాత కిలోమీటరు వరకు పొలాలు, తోటలు దాటాక సముద్రం ఉండేదని స్థానికులు తెలిపారు. రెండేళ్ల క్రితం మేట తీసిన సమయంలో వెస్ట్‌కొక్కిలేరుపై నిర్మించిన వంతెన కొంత బయటపడగా తర్వాత మళ్లీ దానిపై ఇసుక మేటేసింది.

కోతను కట్టడి చేసేందుకు

తీరప్రాంతం కోతకు గురికాకుండా పెదమైనివానిలంక నుంచి ఈ రెండు గ్రామాల వరకు ఏడు కిలోమీటర్లు మేర రక్షణగోడ నిర్మాణానికి కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ 2022లో చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పెదమైనివానిలంకలో ప్రయోగాత్మకంగా కిలోమీటరు రక్షణ గోడ నిర్మాణం నిమిత్తం రూ.35 కోట్లను కేటాయించగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇటీవల నిర్మాణ సంస్థ ప్రతినిధులు కలెక్టర్ చదలవాడ నాగరాణితో సమావేశమై పనుల గురించి వివరించారు.

జ్ఞాపకాలన్నీ కడలిలో కలిసిపోయాయి



ప్రతి ఇంటికి ఎంతోకొంత పొలం ఉండేది. చేపల వేటతో పాటు వివిధ పంటలు పండించేవాళ్లం. ఆనవాళ్లు లేకుండా వాటిని కడలి ముంచెత్తింది. కొత్త ఊరిలో స్థలం ఇవ్వడంతో చాలా ఏళ్ల క్రితమే ఇక్కడకు వచ్చి ఇల్లు కట్టుకుని నివసిస్తున్నాం.

మైల వెంకటసుబ్బారావు, చినమైనివానిలంక

గ్రామాల్లో సదుపాయాలు కల్పించాను



పాత బియ్యపుతిప్ప, చినమైనివానిలంకకు నావలు తిప్పేవాళ్లం. రెండు గ్రామాలకు పైప్‌లైన్ల ద్వారా రక్షిత నీటిని అందించాను. వీధిలైట్ల సదుపాయంతో పాటు చినమైనివానిలంకు తారురోడ్డు నిర్మించాం. కోతతో ఊళ్లు మునిగిపోయాయి.

–కొండేటి రామకృష్ణారావు, మాజీ సర్పంచ్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో షాపు ధ్వంసం



ధ్వంసమైన షాపు

యలమంచిలి: మండలంలోని కాజ తూర్పు బైపాస్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక సోడా కొట్టు, రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. పాలకొల్లు నుంచి చించినాడ వైపు వెళ్తున టిప్పర్ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీ కొట్టింది. ఆ వేగానికి రెండు వాహనాలు సోడా షాపులోనికి దూసుకెళ్లాయి. దీంతో వాహనాలతో పాటు ఆ షాపు ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న పోలీస్ బ్యాచ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కానిస్టేబుల్ చినిమిల్లి వెంకటేశ్వరరావు కుటుంబానికి 2009 బ్యాచ్ పోలీసులు ఆర్థిక సహాయం అందించారు. ఆకివీడు పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్న వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబానికి తన సహచర బ్యాచ్ సభ్యులు లక్ష రూపాయలు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ టీం మెంబర్స్ పాల్గొని వెంటేశ్వరరావు మృతి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

బెల్టు షాపుపై దాడి



నీరుల్లిపాలెంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరు నీరుల్లిపాలెంలో బెల్ట్‌షాపుపై దాడి చేసి ఏడు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్ చేసినట్లు పాలకొల్లు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం మండలంలో అక్రమంగా మద్యం షాపు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు పి.మహేష్, జి.రఘు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భీమవరం యూనిట్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులుగా మంతెన వెంకటనర్సింహ సీతారామరాజు, కటికరెడ్డి వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా బోనం పాండురంగారావు, సరిపిడకల రామరావు, చైర్మన్‌గా మట్లపూడి సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీఖాకొల్లు హనుమంతరావు, మరో 20 మంది సభ్యులతో యూత్ హాస్టల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు వీవీజే సోమరాజు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నర్సింహ సీతారామరాజు మాట్లాడుతూ యూత్ హాస్టల్ భవన నిర్మాణానికి స్థలం సమకూరితే తన సొంత నిధులతో భవనం నిర్మిస్తానన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు, యూత్ అడ్వంచర్ కార్యక్రమాల్లో పాల్గొనే పేద విద్యార్థులకు యూత్ హాస్టల్ తరపున ఆర్థిక సాయమందిస్తామన్నారు.

ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

భీమవరం: వసుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులుని తెలిపారు. డీఎన్నార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 24వ తేది నుంచి మే 3వ తేది వరకూ ఈ శిక్షణా తరగతలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: మండలంలోని పెదఅమిరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎస్.వెంకటేవ్వరరావు తెలిపారు. పెద అమిరం, కోపల్లె, వేంపాడు, గ్రామాలకు, చెరువులకు, ఇండస్ట్రీలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందని ఆదివారం ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు పీజీఆర్ఎస్

పాలకోడేరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార (పీజీఆర్ఎస్) కార్యక్రమం ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు నిర్వహిస్తామని ఎంపీడీవో వి.రెడ్డయ్య తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ప్రజలు తమకున్న సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వొచ్చున్నారు.

వేసవి గట్టెక్కేనా?

- తాగునీటికి తప్పని ఇబ్బందులు
- ప్రస్తుతం పంపుల చెరువు లెవెల్ 15 అడుగులకు చేరింది
- శివారు ప్రాంతాలకు అందని తాగునీరు
- రోజూ ట్యాంకర్ల కోసం ఎదురు చూపులే

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి వచ్చిందంటే చాలు తాడేపల్లిగూడెం పురప్రజలు మంచినీటి కోసం అల్లాడుతుంటారు. ముఖ్యంగా శివారు ప్రాంతాల పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మే నెలలో మరిన్ని ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న ప్రజలే కాక శివారు ప్రాంతాలకు చెందిన ప్రజలు సైతం మునిసిపల్ కుళాయి నీరు సంవృద్ధిగా రాకపోడంతో ఇక్కట్లు పడుతున్నారు. దీనికి ప్రధాన కారణం విద్యుత్ మోటార్లతో కుళాయి నీటిని లాగి వేయడమే. ప్రస్తుతం శివారు ప్రాంతాల వారికి కుళాయి నుంచి నీటి చుక్కలు రావడం గగనమే అవుతుంది. వీరికి మునిసిపల్ ట్యాంకర్లే దిక్కుగా మారింది.

ఒక్క సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ (పంపులు చెరువు) మాత్రమే దిక్కు

పట్టణ జనాభా 1.25 లక్షలు. 35 వార్డుల ప్రజల అవసరాలకు తగిన విధంగా పాతూరులోని పంపులు చెరువు నీటి సామర్థ్యం 546 మిల్లియన్ల లీటర్లు, పట్టణ వాసులకు వేసవిలో 45 రోజులు పాటు కాలువ కట్టేస్తే పంపుల చెరువులో నీరు 25 రోజులకు మాత్రమే సరిపోతుంది. దీంతో సమస్య జఠిలం అవుతుంది. కుళాయి కనెక్షన్లు 16,900 వరకు ఉన్నాయి.

ఎర్త్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లు

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద 2 ఎర్త్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లు ఉన్నాయి. పీ అండ్ టీ కాలనీలో 1, ఎఫ్‌సీఐ కాలనీలో 2, కడకట్లలో 1, టిడ్కో వద్ద 2, సీతారాంపేట 1, యాగర్లపల్లి-1, మొత్తం 10 ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి రోజు పట్టణ వాసులకు 14.5 మిలియన్లు లీటర్ల నీటిని ఉదయం, సాయంత్రం అందజేస్తున్నారు. ప్రజలు పొదుపు పాటించకపోతే వేసవిలో అందరికీ పంపుల చెరువు నీరు సరిపోదు.



పురపాలక సంఘం వద్ద ఎర్త్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్

అధిక శాతం విద్యుత్ మోటార్లు

పట్టణంలోని ప్రజలు అధిక శాతం మోటార్లు కలిగి ఉన్నారు. అందరికి నీరు అందాలనే ఉద్దేశ్యంతో కుళాయిలు వదలి సమయంలో అర్ధ గంట పాటు పట్టణంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. ఈ అర్ధ గంట పాటు మోటార్లు ఉన్నవారు నీటిని తోడకుండా కొంత వరకు కట్టడి చేస్తున్నారు. విద్యుత్ వచ్చిన అనంతరం పట్టణంలోని మోటార్లు ఉన్న వారు తప్ప ఇంక ఎవరికీ నీరు అందకుండా పోతుంది. అపార్ట్‌మెంట్ వాసులు అయితే రెండు పూట్ల జనరేటర్లు వేసి మరీ ఉదయం గంట, సాయంత్రం గంట పాటు కుళాయిల నుంచి నీటిని లాగేస్తున్నారు. అవసరమైన వారికి మంచినీరు అందడం లేదు. శివారు ప్రాంతాల వారు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. వారికి ట్యాంకర్ల ద్వారా సప్లై చేస్తున్నారు.

గోదావరి కాలువ కట్టేస్తే పరిస్థితి ఏమిటి?

గోదావరి కాలువ (స్థానిక ఏలూరు కాలువ) నుంచి తాడేపల్లిగూడెంలోని పాతూరులోని పంపులు చెరువుకు (ఎస్.ఎస్. ట్యాక్)కు భారీగా అండర్ గ్రౌండ్ పైపులతోను, విద్యుత్ మోటార్లుతోను కాలువ నుంచి నీటిని తోడతారు. అయితే ప్రతి సంవత్సరం మాదిరిగానే వేసవిలో కాలువ కట్టేస్తారు. 45 రోజులు తరువాత కాలువను తిరిగి ఒదులుతారు. ఇదే విధానం కొనసాగితే ఇబ్బందులు తప్పవు. పట్టణంలోని పంపులు చెరువు నీటి మట్టం 15 అడుగులు 6 అంగుళాలు, ప్రస్తుతం కాలువ కట్టకపోవడంతో ఇంకా నీటిని తోడుతున్నారు. కాలువలు కట్టిన అనంతరం నిల్వ ఉంచిన నీరు సుమారు 25 రోజుల పాటు ప్రజల అవసరాలకు ఉపయోగపడుతుంది. అనంతరం ఏలూరు కాలువలో మిగిలిన నీటి ప్రవాహానికి క్రాస్ బండ్ వేయడం ద్వారా అడ్డుకట్ట వేసి కాలువలో ఉన్న మిగిలిన నీరు తోడుతారు. ఈ నీరు 5 రోజులకు ఉపయోగపడుతుంది. మొత్తం 30 రోజులు పాటు ఇబ్బందులు ఉండవు. 45 రోజుల పాటు కాలువ వదలకపోతే మరో 15 రోజులు నీటిని ఎలా అందించాలనే దానిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శివారు ప్రాంతాలకు నీటి కష్టాలు

సంవత్సరం పొడవునా శివారు ప్రాంతాలకు నీటి కష్టాలు ఉంటున్నాయి. శివారు ప్రాంతాల వారి కోసం ప్రస్తుతం ట్యాంకర్లు ద్వారా భగత్ సింగ్ నగర్, ఎన్.ఎస్.రాజు లే అవుట్, దానమ్మగడి ఏరియా, ఏరియా ఆసుపత్రి వేనుక సైడ్, జువ్వల పాలెం, తాళ్ళముదునూరుపాడు, టిడ్కో ఇళ్ల సమీపంలో వీకర్స్ సెక్షన్స్ కాలనీకు, వీకర్స్ కాలనీ, కడకట్ల శివారు ప్రాంతాలకు నీటిని పంపుతున్నారు. మరో పంపులు చెరువును నిర్మిస్తే తప్పా పట్టణ వాసులకు నీటి సమస్య అలానే ఉంటుంది. ప్రస్తుతం మరో చెరువు (ఎస్.ఎస్.ట్యాంక్) పనులు కొనసాగుతున్నాయి. మునిసిపాలిటీకి ట్యాంకర్లు లేవు. ప్రస్తుతం 6 అద్దె ట్యాంకర్లుతో శివారు ప్రాంతాలకు పంపిణీ చేస్తున్నారు. శివారు ప్రాంతాలకు రోజుకు 50 ట్రిప్పులు వరకు సరఫరా చేస్తున్నారు. శివారు ప్రాంతాల ప్రజల నీటి కష్టాలు తీర్చాల్సిన పరిస్థితి అధికారులపైన, ప్రజలపైన ఉంది. అదే విధంగా విద్యుత్ మోటార్లను ఆపకపోతే సమస్య మరింత జఠిలం కాకతప్పదు.



ప్రస్తుతం నీటి మట్టం 15 అడుగులు ఉన్న పంపుల చెరువు (సమ్మర్ స్టోరేజీ ట్యాంక్)



ట్యాంకర్ నుంచి తాగునీటిని పడుతున్న స్థానికులు

> **సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రారంభించాం**
>
> 
>
> వేసవి కావడంతో పట్టణ ప్రజలు కుళాయి తాగు నీటిని పొదుపుగా వాడాలి. సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాము. ప్రస్తుతం అద్దె ట్యాంకర్లు ఉన్నాయి. కుళాయిలు వదిలే సమయంలో మోటార్లు వినియోగం తగ్గిస్తే చాలా ప్రాంతాల వారికి నీరు అందుతుంది. ప్రజలు తప్పక సహకరించాలి.
>
> – ఎం.ఏసుబాబు, మునిసిపల్ కమిషనర్ తాడేపల్లిగూడెం

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెంటపాడు: మండలంలోని అలంపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మౌంజీ పాడు గ్రామానికి చెందిన బోదనపు నిర్మల (42) తన కుమారుడు దుర్గారావుతో అలంపురం పని నిమిత్తం బైక్‌పై వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో కుక్క అడ్డురావడంతో వీరు ప్రయాణిస్తున్న బైక్‌పై నుంచి పడిపోయారు. ఈ ఘటనలో నిర్మలకు తలకు బలమైన గాయం కావడంతో ఆమె మృతి చెందింది. మృతురాలి కుమార్తె గాయత్రి ఫిర్యాదు మేరకు ఏఎస్సై రాజేంద్ర కేసు నమోదు చేస్తున్నారు.

కంటి సంరక్షణ, వ్యాధులపై అవగాహన



కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి మూడో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీఎస్ లక్ష్మీనారాయణ, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి కోరారు. స్థానిక కడకట్ల జనతా ట్రస్ట్ ఆవరణలో డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో దాత పదం కుమార్‌గుప్తా సహకారంతో నిడదవోలు రాజరాజేశ్వరీ రామకృష్ణ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ చలంచర్ల సుబ్బారావు ప్రారంభించారు. 93 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించగా, ఉచితంగా 22 మందికి కళ్లజోళ్లు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఆపరేషన్ల నిమిత్తం 10 మందిని, నిడదవోలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మరో 14 మందిని ప్రత్యేక ట్రీట్‌మెంట్ నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు నిర్ణయించారు. కంటి వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సుంకర శ్రీనివాస్, పచ్చ వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎర్ర ఆంజనేయ స్వామి, తదితర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

- పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ప్రేమ విందులు..కొవ్వొత్తుల ర్యాలీలు



ఈపీఎఫ్ చర్చిలో వాక్యం బోధిస్తున్న వ్యవస్థాపకురాలు అరుణకుమారి



గూడెం సెంటినరీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గురుమండల అధ్యక్షులు



గూడెం బైబిలు మిషను రాజా ఎలీషా ఆధ్వర్యంలో పోలీస్ ఐలాండ్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు



రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంలో గూడెంలో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

పెంటపాడు: ఈస్టర్ పర్వదినం పురస్కరించుకొని పలు ప్రాంతాలలోని చర్చిల్లో ఆదివారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు, కొవ్వొత్తుల ర్యాలీలు, సమాధుల ప్రాంతాల్లో పూర్వీకులకు ప్రభు సంస్కార విందులు, అన్నసమారాధనలు, రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గంలో పలు డినామినేషన్లకు చెందిన క్రైస్తవుల చర్చిల్లో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గూడెం సెంటినరీ చర్చిలో గురు మండల అధ్యక్షుడు డీఎల్ పీనెహాస్, రత్నాకర్, పాలకవర్గ సభ్యులు భక్తి గీతాలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతూరు సమాధుల ప్రాంతాల్లో ఆదివారం కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గాడ్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కడకట్ల ఓవర్‌బ్రిడ్జి సెంటర్ నుంచి పోలీస్ ఐలాండ్ వరకు విశ్వాసులతో ర్యాలీలు చేశారు. గూడెం బైబిలు మిషను నాయకులు రాజా ఎలీషా, మరనాత ఎలీషా, బెసలేల్‌ల ఆధ్వర్యంలో సుమారు 1000 మందికి పైగా విశ్వాసులతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బాగ్యలక్ష్మీపేట ఎల్ఎల్ఎం చర్చిలో పాస్టర్ల సంఘ నాయకులు మల్లిపూడి జైబాబు ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. తణుకు ఈపీఎఫ్ చర్చిలో పాస్టర్ పరస మోజస్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పైడిపర్రు చర్చిలో చర్చి వ్యవస్థాపకురాలు అరుణకుమారి, ప్రైజీల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో హాజరైన విశ్వాసులకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి, ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ముదునూరుపాడులో బైబిలు మిషను నాయకులు ఎ.దైవారావు, గొల్లగూడెం సెంటర్ పాస్టర్ ఎజ్రాశాస్త్రి, రాచర్ల రూపాంతర దేవాలయం, ప్రత్తిపాడు జీడీఎం చర్చి, బైబిలు మిషను చర్చిల్లో పాస్టర్ కందికొండ రత్నరాజు, కేఎస్ఎస్ కాలనీ, కొండాయి చెరువు ఫెయిత్ చర్చి, గూడెం మదర్‌వన్నిని చర్చి, వీకర్స్ కాలనీ, బ్యాంకు కాలనీ, గూడెం మండలం కడియద్ద, పట్టింపాలెం, బంగారుగూడెం, పెంటపాడు మండలం పరిమెళ్ల, యానాలపల్లి, జట్లపాలెం, దర్శిపర్రు మీనవిల్లూరు రామచంద్రపురం, అలంపురం, తదితర గ్రామాల్లోని ఆయా డినామినేషన్లకు చెందిన చర్చిల్లో ఈస్టర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వృద్ధుల ఇంటికే వైద్య సేవలు



వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికీ ఉచిత వైద్య సేవలు అందించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య ప్రత్యేక వాహనం ద్వారా తణుకు, చివటం ప్రాంతాల్లో పర్యటించి ఎనిమిది మంది వృద్ధులకు వైద్య సేవలు అందజేశారు. సభ్యులు షేక్ మస్తాన్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి తెలిపారు. ఉచిత వైద్య సేవలకు 99853 43530, 90592 90717 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఆర్జి భాస్కరరావు, గిరిజాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది రాములోరికి గుడి



నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న విగ్రహాలు

ఆకివీడు: స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద శతాబ్ది కాలం క్రితం ఏర్పాటు చేసిన రాములోరి ఆలయానికి నూతన శోభ చేకూరింది. పూరి గుడిసె నుంచి చిన్న గదిలో ఉన్న రాములోరి ఆలయం శిథిలావస్థకు చేరడంతో పక్కాగా గుడి నిర్మించడంతో స్థానిక భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం నుంచి ఆలయం వద్ద నిర్వహించనున్నారు. పురాతన విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేశారు. మహాబలిపురంలో తయారు చేసి, తీసుకొచ్చిన విగ్రహాలను మంగళవారం ప్రతిష్ఠించనున్నారు. సోమవారం నుంచి ఆలయం వద్ద హోమాలు, ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్మాణకర్తలు భీష్మ, హరి తెలిపారు.

అగ్నిమాపక సిబ్బంది విధులు సాహసోపేతం



తాడేపల్లిగూడెం (టీఓసీ): కర్ర పత్రాలను ప్రదర్శిస్తున్న సిబ్బంది



అత్తిలి: సమావేశంలో మాట్లాడుతున్న ఫైర్‌మేన్ సుబ్రహ్మణ్యం



తణుకు అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న జైలు సూపరింటెండెంట్ మోహనరావు

తణుకు అర్బన్: అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సాహసోపేతమైన విధులు అభినందనీయమని తణుకు సబ్‌జైలు సూపరింటెండెంట్ మోహన్‌రావు, గాయత్రి హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ గుడ్ల సతీష్ అన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకు కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు సిబ్బంది ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తారని వారి సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రమాదాల్లో నిప్పుతో పాటు పొగ కూడా చాలా ప్రమాదమని పొగ పీల్చి ఊపిరాడక ప్రాణ నష్టం సంభవిస్తుందని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదాలే కాకుండా ప్రకృతి విపత్తుల్లో ముందుగా స్పందించేది అగ్నిమాపక విభాగమేనన్నారు. ఈ వారం రోజుల పాటు అగ్నిమాపక సిబ్బంది కర్మాగారాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, పెట్రోలు బంకులు, అపార్టుమెంట్లలో ప్రజలకు ప్రమాదాలపై అవగాహన కల్పించిన తీరు ప్రశంసనీయమని స్పష్టం చేశారు. తణుకు అగ్నిమాపక కేంద్ర అధికారి ఐ.అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గమిని ఫిల్లింగ్ స్టేషన్ అధినేత గమిని రాజా, న్యాయవాది అజయ్, కారుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకులు కారుమంచి యోహాన్, తణుకు సిటీ సతీష్, అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం

అత్తిలి: ప్రకృతి విపత్తుల సమయాల్లో అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అత్తిలి అగ్నిమాపక కేంద్రంలో సమావేశం నిర్వహించారు. లీడింగ్ ఫైర్‌మేన్ జి.నాగసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ప్రాణ, ఆస్తి నష్ట నివారణలో సిబ్బంది చేస్తున్న సేవలను వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో గ్యాస్ డీలర్లు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలను నివారిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అగ్నిమాపక వారోత్సవాలు తాడేపల్లిగూడెం అగ్నిమాపక కేంద్రాధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఏడోవ రోజు ముగిసాయి. చివరి రోజు అగ్నిమాపక కేంద్రం వద్ద పలు పరికరాలను ప్రదర్శించారు. పలు శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, బాణసంచా వ్యాపారస్తులు, స్థానిక వర్తకులు హాజరయ్యారు. వారికి అగ్ని ప్రమాదాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను పంపిణీ చేసి, వాటిని ప్రదర్శించారు. రామారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే ప్రారంభ దశలోనే వాటిని అరికట్టాలన్నారు. దీని వలన పెను ప్రమాదాలు జరగకుండా చూడొచ్చని వివరించారు. సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.